

# టాటా ఎలక్ట్రిక్ కార్లపై బంపర్ ఆఫర్

## రూ.1.86 లక్షల వరకు ప్రయోజనాలు కల్పిస్తున్న సంస్థ

ముంబై, ఫిబ్రవరి 20: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన టాటా మోటర్స్ మరో రికార్డు సృష్టిచింది. దేశవ్యాప్తంగా 2 లక్షల ఈవీ కార్లను విక్రయించిన సందర్భంగా కొనుగోలుదారులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించనున్నట్లు ప్రకటించింది. వచ్చే 45 రోజుల పాటు కొనుగోలు చేసే ఈవీ మాడళ్లపై రూ.2 లక్షల వరకు ప్రయోజనాలు కల్పిస్తున్నది. నూతన ఈవీని కొనుగోలు చేసేవారికి ఎక్స్చేంజ్ బోనస్ కింద రూ.50 వేలు, జీరో డౌన్‌పేమెంట్‌తో 100 శాతం ఫైనాన్స్, ఆరు నెలలపాటు నెక్సాన్.ఈవీ, కర్వ్.ఈవీలను ఆరు నెలలపాటు ఉచితంగా చార్జింగ్ చేసుకునే అవకాశాన్ని కల్పించింది. 7.2 కిలోవాట్ల ఏసీ ఫాస్ట్ చార్జర్‌ను ఇంట్లోనే ఇన్‌స్టాల్ చేసుకోనే వీలుంటుంది. 2027 నాటికి దేశవ్యాప్తంగా 4 లక్షల చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేయడానికి సంస్థ సిద్ధమైంది.

# ఇల్లు కొనాలి.. వ్యాపారం పెట్టాలి

## దేశంలోని మెజారిటీ మిల్లేనియల్స్ లక్ష్యాలివే
## ఓ తాజా అధ్యయనంలో వెల్లడి

ముంబై, ఫిబ్రవరి 20: ఇల్లు కొనడం.. వ్యాపారాన్ని మొదలుపెట్టడం.. ఆర్థిక స్వాతంత్ర్యం.. ఈ మూడే ఇప్పుడు దేశంలోని అత్యధిక మిల్లేనియల్స్ దీర్ఘకాల లక్ష్యాలు. 'ఫైబ్-మిల్లేనియల్ అప్‌గ్రేడ్ ఇండెక్స్' ఆధారంగా జరిగిన ఓ అధ్యయనంలో సొంతింటి కలను నెరవేర్చుకోవడమే తమ లక్ష్యమని 41 శాతానికిపైగా మిల్లేనియల్స్ స్పష్టం చేశారు. వీరిలో ఎక్కువమంది వయసు 30 శాతంలోపేనని తేలింది. ఇక పురుషులతో పోల్చితే ఒంటరి మహిళల్లో ఇల్లు కొనాలనే ఆశ బలంగా ఉండటం గమనార్హం. కాగా, దాదాపు 21 శాతం మంది తమ వ్యాపారాభివృద్ధికే శ్రమిస్తున్నట్టు చెప్పారు. 19 శాతం మంది ఎవరి సాయం లేకుండా తాము ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఆకాంక్షను కనబర్చారు. దేశవ్యాప్తంగా మెట్రో, నాన్-మెట్రో నగరాల్లోని 8వేల మంది అభిప్రాయాలతో ఈ అధ్యయనం జరిగింది. వీరిలో 47 శాతం మంది 30 ఏండ్లలోపు వయసున్నవారే. 30-35 ఏండ్లవారు 26 శాతం, 35-40 ఏండ్లవారు 14 శాతం, 40 ఏండ్లకుపైగా వయసున్నవారు 13 శాతం ఉన్నారు. 1981 నుంచి 1996 మధ్య జన్మించినవారి (29-44 ఏండ్ల వయస్కులు)ని మిల్లేనియల్స్‌గా పిలుస్తారన్న విషయం తెలిసిందే.

**స్వల్పకాలిక లక్ష్యాల్లో..**

మిల్లేనియల్స్ స్వల్పకాలిక లక్ష్యాల్లో వృత్తిపరమైన వృద్ధి, కొత్త గ్యాడ్జెట్ లేదా వాహనం కొనుగోలు వంటివి ముందున్నాయి. మరికొందరు దంత చికిత్స, కంటి ఆపరేషన్లు చేయించుకోవాలని కూడా చెప్పడం విశేషం. ఇదిలావుంటే మెట్రో నగరాల్లో ఉన్న మిల్లేనియల్స్‌లో మెరుగైన ఉద్యోగాన్ని సంపాదించడం కష్టంగా ఉందన్న అభిప్రాయం ఉన్నట్టు సర్వే తెలిపింది. జాబ్ మార్కెట్‌లో విపరీతంగా పెరిగిన పోటీయే ఇందుకు కారణమన్నది. ఈ క్రమంలోనే 60 శాతం మందికి మెరుగైన ఉద్యోగమే లక్ష్యంగా ఉన్నట్టు పేర్కొన్నది. మొత్తానికి మిల్లేనియల్స్ ఆశలు, ఆకాంక్షలు, అభిప్రాయాల కలబోతగా ఈ అధ్యయనం నిలుస్తున్నది. వారి లక్ష్యాల సాధనకు ఏం చేయాలి? ఎలా ముందుకెళ్లాలన్నదానిపై ఓ స్పష్టతనే కలిగి ఉన్నారని చెప్పవచ్చు. అయితే అందుకు తగ్గట్టు కంపెనీల యాజమాన్యాలు, ప్రభుత్వాలు, కుటుంబాలు సహకారం అందిస్తే వేగంగా ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని సర్వే అభిప్రాయపడింది.



- 35 శాతం మంది మిల్లేనియల్స్‌కు భారంగా మారుతున్న పెరిగిన కుటుంబ ఖర్చులు
- 15 శాతం మందిలో కొరవడిన దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళికలు
- వ్యూహాత్మకంగా పొదుపు చేస్తున్నామని, ఆర్థిక ప్రణాళికలు వేస్తున్నామంటున్న 39 శాతం మిల్లేనియల్స్
- ఇతర లేదా అదనపు ఆదాయ మార్గాల అన్వేషణలో 21 శాతం మంది
- దీర్ఘకాల లక్ష్యాల సాధనకు రుణ సాయాన్ని కోరుకుంటున్న 29 శాతం మిల్లేనియల్స్



*మా అధ్యయనం మిల్లేనియల్స్‌లో ఉన్న బలమైన ఆకాంక్షలకు అద్దం పట్టింది. వారు ఎదుర్కొంటున్న సవాళ్లు, ఆర్థికపరమైన కోర్కెలను తెలియజేసింది. నిజానికి చాలామంది వారి స్వల్పకాలిక ఆశలను, తక్షణ అవసరాలను, సౌకర్యాలను తీర్చుకోవడానికి బ్యాంకులు, ఇతరత్రా ఆర్థిక సంస్థల నుంచి రుణాల కోసం ప్రయత్నిస్తున్నారు.*

-అక్షయ్ మెహ్రోత్రా, ఫైబ్ వ్యవస్థాపక సీఈవో



## సీఈఏ పదవీకాలం రెండేండ్లు పొడిగింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: ప్రధాన ఆర్థిక సలహాదారు వీ అనంత నాగేశ్వర్ పదవికాలాన్ని రెండేండ్లు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. దీంతో మార్చి 2027 వరకు ఆయన సీఈఏ పదవిలో కొనసాగనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన అపాయింట్‌మెంట్ కమిటీ సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. జనవరి 28, 2022న నాగేశ్వరన్ పదవీ బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం రూపొందించే ఆర్థిక పాలసీలపై సలహాలతోపాటు బడ్జెట్ కంటే ముందు పార్లమెంట్‌కు సమర్పించే ఆర్థిక సర్వేను ఆయన రూపొందించాల్సి ఉంటుంది.

**నీతి ఆయోగ్ సీఈవో కూడా..**

నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం పదవీ కాలాన్ని ఓ ఏడాది పాటు కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. ఆయన ఈ పదవిలో 2023 ఫిబ్రవరిలో నియమితులయ్యారు. ఆయన పదవీ కాలం పొడిగింపును క్యాబినెట్ కమిటీ ఆమోదించింది.

## వరుసగా మూడోరోజూ నష్టాలే

ముంబై, ఫిబ్రవరి 20: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడోరోజూ నష్టపోయాయి. టారిఫ్ ఆందోళనలు పెరుగుతుండటం, ఆసియా మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతుండటం, ఎఫ్ఐఐలు పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగుతుండటం మదుపరుల సెంటిమెంట్‌ను నీరుగార్చింది. ఫలితంగా ఇంట్రాడేలో 500 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరికి 203.22 పాయింట్లు కోల్పోయి 75,735.96 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 19.75 పాయింట్లు నష్టపోయి 22,913.15 వద్ద నిలిచింది. బ్లూచిప్ సంస్థల షేర్లు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు విలువ 2.35 శాతం తగ్గి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు మారుతి, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఐటీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్‌లు భారీగా నష్టపోయాయి. కానీ, ఎన్‌టీపీసీ, అదానీ పోర్ట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగిశాయి. దేశీయ ఉత్పత్తులపై అమెరికా సుంకాన్ని విధించడానికి సిద్ధమవుతుండటంతో మదుపరుల్లో ఆందోళన నెలకొన్నది..దీంతో అమ్మకాలకు మొగ్గుచూపడంతో సూచీలు నష్టపోయాయని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. ద్రవ్యోల్బణ గణాంకాలు పెరుగుతుండటంతో ఇప్పట్లో అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు లేకపోవడం కూడా సూచీల పతనానికి పరోక్షంగా కారణమయ్యాయని చెప్పారు.

## భారత్‌లో ఐఫోన్ 16ఈ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: ఐఫోన్ సిరీస్ ఫోన్లు భారత్‌లోనే తయారవుతున్నాయి. ఇప్పటికే పలు ఫోన్లు ఉత్పత్తి అవుతుండగా.. తాజాగా 16ఈ ఫోన్ కూడా అసెంబ్లింగ్ అవుతున్నది. చెన్నై ప్లాంట్లో తయారవుతున్న ఈ ఫోన్ భారత్‌తోపాటు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నది. భారత్‌లో ఈ ఫోన్ ఈ నెల 28 నుంచి అందుబాటులోకి రాబోతున్నది. ఈ ఫోన్ కావాలనుకునేవారు ఈ శుక్రవారం నుంచి ముందస్తు బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది.



# ఫ్రెషర్లకు గిరాకీ

**కొత్త నైపుణ్యాలకు ప్రాధాన్యత ● డీప్-టెక్‌కు డిమాండ్: టీమ్‌లీజ్**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: దేశీయ మార్కెట్‌లో ఫ్రెషర్లకు మళ్లీ మంచి రోజులొస్తున్నాయి. ఇన్నాళ్లూ కొత్తవారిని దూరం పెడుతూవస్తున్న కంపెనీలు.. తిరిగి వారికి పెద్దపీట వేస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయని టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ కెరీర్ ఔట్‌లుక్ రిపోర్ట్‌లో తెలుస్తున్నది. గత ఏడాది ద్వితీయార్ధం (జూలై-డిసెంబర్)తో పోల్చితే ఈ ఏడాది ప్రథమార్ధం (జనవరి-జూన్)లో ఫ్రెషర్స్ హైరింగ్‌కు ఆయా కంపెనీలు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నట్టు తాజా నివేదిక చెప్తున్నది. ముఖ్యంగా రాబోయే రోజుల్లో ఐటీ రంగానికి వ్యాపారావకాశాలు బాగుంటాయన్న అంచనాలు ఓవైపు.. డీప్-టెక్ ఆధారిత నైపుణ్యాలున్నవారికి క్రమేణా ఆదరణ పెరుగుతుండటం ఇంకోవైపు.. వెరసి ఫ్రెషర్లకు అనుకూల వాతావరణం ఏర్పడుతున్నది.

**ఇదీ సంగతి..**

మారుతున్న టెక్నాలజీకి తగ్గట్టుగా.. ఉద్యోగుల నైపుణ్యాల్లోనూ మార్పులు వచ్చేస్తున్నాయి. నిత్యనూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎవరైతే అందిపుచ్చుకుంటారో వారినే అవకాశాలూ వరిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఇప్పుడు రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, నెట్‌వర్క్ సెక్యూరిటీ, ప్రాంప్ట్ ఇంజినీరింగ్ వంటి డీప్-టెక్ స్కిల్స్ ఉన్నవారికి డిమాండ్ కనిపిస్తున్నది. ఇక జెనరేటివ్ ఏఐ, మెషిన్ లెర్నింగ్‌లో ప్రొఫెషనల్ సర్టిఫికెట్ కోర్సులు, సర్టిఫైడ్ రోబోటిక్ ఇంజినీర్ కోర్సు, క్లౌడ్ కంప్యూటింగ్‌లో ప్రొఫెషనల్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్స్, డివోప్స్, హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, ఏఐ అప్లికేషన్స్ తదితర కోర్సులను చేసినవారికి గిరాకీ ఉన్నదని ఇండస్ట్రీ వర్గాలు చెప్తున్నాయి. దీంతో ఈ నైపుణ్యాలున్న ఫ్రెషర్స్‌ను ఉద్యోగాల్లో నియమించుకోవడానికి కంపెనీలు ముందుకొస్తున్నాయని, గతంతో పోల్చితే ఫ్రెషర్స్, డిగ్రీ అప్రెంటిక్స్ హైరింగ్‌పట్ల సంస్థల ఆసక్తి 74 శాతం పెరిగిందని టీమ్‌లీజ్ వెల్లడించింది. కాగా, దేశవ్యాప్తంగా 649 కంపెనీలు టీమ్‌లీజ్ సర్వేలో పాల్గొన్నాయి.

**నివేదికలో ముఖ్యాంశాలు**

- ఈ-కామర్స్, టెక్నాలజీ స్టార్టప్‌ల్లో ఫ్రెషర్స్‌ను ఉద్యోగాల్లోకి తీసుకోవాలన్న ఆసక్తి ఈ జనవరి మొదలు 61 శాతం నుంచి 70 శాతానికి పెరిగింది.
- తయారీలో 66 శాతానికి, ఇంజినీరింగ్, ఇన్‌ఫ్రాల్లో 62 శాతానికి పెరుగుదల.
- ఐటీలో ఫ్రెషర్స్ నియామకాలపట్ల ఆసక్తి 45 శాతం నుంచి 59 శాతానికి ఎగిసింది.
- హెల్త్‌కేర్, ఫార్మా రంగాల్లోనూ 47 శాతం నుంచి 52 శాతానికి పెరిగింది.

## ఐపీవోకి ఫోన్‌పే!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: ఫోన్‌పే కూడా స్టాక్ మార్కెట్లో లిస్ట్‌కావడానికి సిద్ధమవుతున్నది. ప్రస్తుతం కంపెనీ విలువ 12 బిలియన్ డాలర్లు. దేశీయ మార్కెట్లో సుస్థిరమైన స్థానం సంపాదించుకున్న ఈ విదేశీ సంస్థ వెనుకుండి సేవలు అందిస్తున్న ఫోన్‌పే..దేశీయ మార్కెట్లోకి అడుగుపెట్టి పదేండ్లు పూర్తైన సందర్భంగా ఎక్స్చేంజ్‌ల్లో అడుగుపెట్టడానికి ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఐపీవో సన్నాహాల్లో భాగంగా ఫోన్‌పే 2022 డిసెంబర్‌లోనే తన హోల్డింగ్ కంపెనీని సింగపూర్ నుంచి భారత్‌కు తరలించింది. ఇందుకోసం రూ.8 వేల కోట్లు పన్ను రూపంలో చెల్లించింది. ప్రస్తుతం డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో 48 శాతం వాటాతో ఫోన్‌పే అగ్రస్థానంలో ఉన్నది. గూగుల్‌పే 37 శాతం వాటాతో రెండో స్థానంలో కొనసాగుతన్నది.

# పీఎన్‌బీ వడ్డీరేట్లు తగ్గింపు

- పావు శాతం కోత విధించిన బ్యాంక్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) వడ్డీరేట్లను పావుశాతం మేర తగ్గించింది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో గృహ, వాహన, విద్యా, వ్యక్తిగత రుణాలపై ఈఎంఐలు మరింత తగ్గనున్నాయి. రిజర్వు బ్యాంక్ రెపో రేటును పావు శాతం తగ్గించిన నేపథ్యంలో ప్రధాన బ్యాంకులు వరుసగా వడ్డీరేట్లను తగ్గిస్తున్నాయి. ఇప్పటికే ఎస్బీఐ వడ్డీరేట్లను పావు శాతం కోత విధించిన విషయం తెలిసిందే. దీంట్లోభాగంగా పీఎన్‌బీ..గృహ రుణాలపై వడ్డీరేటును 8.15 శాతానికి దించింది. దీంతోపాటు రుణగ్రహీతలకు మరిన్ని ప్రయోజనాలు కల్పించనున్నట్లు ప్రకటించింది. ప్రాసెసింగ్ ఫీజుతోపాటు డాక్యుమెంటేషన్ చార్జీలను సైతం పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు బ్యాంక్ పేర్కొంది. ఈ అవకాశం మార్చి 31 లోపు తీసుకునే రుణాలకు వర్తించనున్నదని తెలిపింది. అలాగే సాంప్రదాయక గృహ రుణాల స్కీం కింద 8.15 శాతం వడ్డీకే రుణాలు అందిస్తున్నది. ఈ స్కీం కింద లక్ష రూపాయల రుణానికి ఈఎంఐ రూ.744గా నిర్ణయించింది. దీంతోపాటు నూతన, సెకండ్ హ్యాండ్ కార్లపై 8.50 శాతం వడ్డీకి రుణాలు అందిస్తున్నది. లక్ష రూపాయల రుణంపై రూ.1,240 ఈఎంఐ చెల్లించాల్సివుంటుంది. వాహన కొనుగోళ్లు పెంచాలనే ఉద్దేశంతో ఈ రుణాలపై 0.05 శాతం రాయితీ కల్పించింది. 120 నెలల్లో తిరిగి చెల్లింపులు జరిగే విధంగా ఎక్స్-షోరూం ధరపై 100 శాతం రుణాన్ని అందించనున్నట్లు ప్రకటించింది. అలాగే 7.85 శాతానికి విద్యా రుణాలు ఇవ్వనున్నది. డిజిటల్ ప్రాసెసింగ్‌తో కస్టమర్ రూ.20 లక్షల వరకు రుణాన్ని తీసుకునే అవకాశాన్ని కూడా కల్పించింది బ్యాంక్. రుణం కోసం బ్యాంక్ శాఖకు లేదా పేపర్‌వర్క్ లేకుండా పూర్తిచేయనున్నది. దీనిపై వడ్డీరేటును 11.25 శాతానికి దించింది. తగ్గించిన వడ్డీరేట్లు ఈ నెల 10 నుంచే అమలులోకి వచ్చాయని పేర్కొంది.

## మలిదశ ఉద్యమంలోనే ప్రత్యేక రాష్ట్రం



తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎదులాపురం, ఫిబ్రవరి 20 : తొలి దశ ఉద్యమంలో ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష నెరవేరలేదని, మలి దశలో కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్ అన్నారు. తెలంగాణ బిల్లు ఆమోదం పొందిన ఫిబ్రవరి 20వ తేదీని పురస్కరించుకుని బీఆర్ఎస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణకు అనుకూల నినాదాలు చేస్తూ తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీసీ పట్టణ అధ్యక్షుడు దాసరి రమేశ్, నాయకులు అజయ్, ప్రహ్లాద్, బుట్టి శివకుమార్, సాజీదుద్దీన్, దమ్మపాల్ పాల్గొన్నారు.

## ఆటో బోల్తా : పలువురికి గాయాలు

కడెం, ఫిబ్రవరి 20 : నిర్మల్ జిల్లా కడెం మండలంలోని కన్నాపూర్ చెరువు వద్ద నిర్మల్-మంచిర్యాల ప్రధాన రహదారిపై గురువారం ఉదయం ఆటో బోల్తా పడి నలుగురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. కడెం నుంచి దస్తురాబాద్ మండలంలోని గొడిసెర్యాల గ్రామానికి నలుగురు ప్రయాణికులతో వెళ్తున ఆటో కన్నాపూర్ చెరువు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గొడిసెర్యాలకు చెందిన నలుగురికి గాయాలు కాగా, అదే గ్రామానికి చెందిన ఎల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం నిర్మల్ దవాఖానకు తరలించారు. ఆటో డ్రైవర్ సంఘటన స్థలం నుంచి పరారైనట్లు స్థానికులు తెలిపారు. ఈ మేరకు ఆటోను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.

## ఎడ్లు దొంగలించేందుకు యత్నించిన వ్యక్తిపై కేసు

కుభీర్, ఫిబ్రవరి 20: నిర్మల్ జిల్లా తానూర్ మండలం ఉమ్రి (కే) గ్రామంలోని గంగాధరోల్ల రామ్ అనే రైతుకు చెందిన ఎడ్లు దొంగిలించేందుకు యత్నించిన భైంసా మండలం కుంసర గ్రామానికి చెందిన పవార్ మారోతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరా ప్రకారం.. బుధవారం రాత్రి రామ్ ఉమ్రి(కే) శివారులోని తన కొట్టంలో ఎడ్లను కట్టేసి ఇంటికి వచ్చాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత కట్టేసి ఉంచిన ఎడ్లను దొంగ మారోతి విడిపించుకుని ఎడ్లను తోలుతూ భైంసా వైపు పయనమయ్యాడు. మళ్లీ మేత వేసేందుకని వెళ్లిన రామ్‌కు ఎడ్లు కనిపించక పోవడంతో పలువురిని వెంటబెట్టుకుని ఎడ్లను వెతుకుతూ శివారు ప్రాంతాలు, చుట్టు పక్కల గ్రామాల్లో విచారించారు. సిరాల శివారు నుంచి ఎడ్లను తోలుకుని పోతున్న మారోతిని గమనించిన వారు ఆయనను పట్టుకుని, ఎడ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తానూర్ పోలీసులకు మారోతిని అప్పగించారు.

## నూతన సాంకేతికత వినియోగించుకోవాలి

జైపూర్, ఫిబ్రవరి 20: నూతన సాంకేతికతను వినియోగించుకోవాలని ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్ పేర్కొన్నారు. గురువారం ఎస్టీపీపీ ఉద్యోగులకు ఎఫ్ఎల్ఎం మేనేజ్‌మెంట్ (ఫైల్ లైఫ్ సైకిల్ మేనేజ్‌మెంట్) కార్యక్రమంపై సీనియర్ ప్రోగ్రామర్ శంకర్, ట్రేని ప్రోగ్రామర్ రమ్య అవగాహన కల్పించారు.ఈ ఫైల్ లైఫ్ సైకిల్ మేనేజ్‌మెంట్ ద్వారా కాగితపు వినియోగం గణనీయంగా తగ్గుతుందని ఈడీ రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎం శ్రీనివాసులు, డీజీఎంలు మహేందర్, అజాజుల్లాఖాన్, వేణుగోపాల్, జనగామ శ్రీనివాస్, పంతుల, సూపరింటెండెంట్ రవీందర్, ఎస్వోటూ జీఎం వెంకటయ్య, పర్సనల్ అధికారి ఠాకూర్ మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

## జాయింట్ సర్వే నిర్వహణ హద్దులను నిర్ణయించిన అధికారులు

నర్సాపూర్(జీ), ఫిబ్రవరి 20 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ)కి చెందిన ముష్కం సత్యమ్మ 686 సర్వే నంబర్‌లో ఏడు గుంటల భూమి తనదంటూ గతంలో హైకోర్టులో ఫిటిషన్ వేసింది. గురువారం జిల్లా పంచాయతీ అధికారి పోతకోటి శ్రీనివాస్, తహసీల్దార్ సోమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 686 సర్వే నంబర్ భూమి కొలతలు చేపట్టి హద్దులను నిర్ణయించారు. ఈ సందర్భంగా డీపీవో శ్రీనివాస్ మాట్లాడుతూ జాయింట్ సర్వే చేయడం వల్ల అనుమతులు లేకుండా డాగ్ బంగ్లా ప్రభుత్వ భూమిలో ఇంటి నిర్మాణాలు బయటపడ్డాయని తెలిపారు. వారి వివరాలు కూడా సమగ్ర సర్వే చేపట్టి ప్రభుత్వ భూములను కాపాడుతామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి పోతకోటి శ్రీనివాస్, తహసీల్దార్ సోమ శ్రీనివాస్, ఆర్ఐ వేణుగోపాల్, ఎంపీవోలు శ్రీనివాస్ గౌడ్, తిరుపతి రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు వీణ, కైలాస్, సర్వేయర్ రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



686 సర్వే నంబర్‌లో కొలతలు చేపడుతున్న సిబ్బంది

## హిమాలయ పర్వతాలను అధిరోహించిన నిర్మల్ వాసి

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 20 : నిర్మల్ పట్టణంలోని బేస్తవార్‌పేట్ కాలనీకి చెందిన లక్కాకుల ఆదిత్య హిమాలయాల్లోని కేదారిఖండ్ శిఖరాన్ని అధిరోహించాడు. ఈ పర్వతాన్ని ఐదు రోజుల్లో అధిరోహించినట్లు తెలిపాడు. 15 రాష్ట్రాల నుంచి 300 మంది ప్రారంభం కాగా.. ఏడుగురు వ్యక్తులు మాత్రమే అధిరోహించారు. ఇందులో నిర్మల్‌కు చెందిన ఆదిత్య మొదటిస్థానంలో ఉండడం విశేషం. ఆ తర్వాత ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడమే తన లక్ష్యమని చెప్పాడు. ఆదిత్య పంజాబ్‌లోని ఎల్‌పీయూ యూనివర్సిటీలో ఎంసీఏ చదువుతున్నాడు.



లక్కాకుల ఆదిత్య

## ఖేలో ఇండియా సౌత్ జోన్ ఉషూ పోటీలకు నిర్మల్ జిల్లా క్రీడాకారులు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

భైంసా, ఫిబ్రవరి 20 : ఈ నెల 18, 19 తేదీన స్పోర్ట్స్ అథార్టీ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో అమట్యూర్ ఉషూ అసోసియేషన్ ఆఫ్ ఆదిలాబాద్ వారు ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో ఖేలో ఇండియా ఉమెన్స్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ రాష్ట్ర స్థాయి ఉషూ ఎంపిక పోటీల్లో నిర్మల్ జిల్లాకు ఐదు బంగారు పతకాలు, రెండు రజత పతకాలు, 8 కాంస్య పతకాలు సాధించినట్లు ఉషూ కోచ్ శ్రీరాముల సాయికృష్ణ తెలిపారు. లోలం మమత, నక్షత్ర, ఈశ్వరి, గౌరిబాయి, శ్రీరాముల భాగ్యలక్ష్మిలు బంగారు పతకాలు, ప్రణతి, శృతి రజత పతకం, మైథిలి, కౌశక్, వైష్ణవి, సోనితాయి, స్వాతి, శైలజ, షేక్‌జోయ, శ్రీరాముల కృషికలు కాంస్య పతకాలు సాధించినట్లు ఆయన తెలిపారు. వీరిని పలువురు అభినందించారు.




గాదిగూడ ఎంపీడీవో కార్యాలయంలో స్పోర్ట్స్ కిట్లు

## స్పోర్ట్స్ కిట్ల పంపిణీ ఎప్పుడో..?

నార్నూర్, ఫిబ్రవరి 20 : ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలంలోని 25 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నెల క్రితమే స్పోర్ట్స్ కిట్లను మంజూరు చేసింది. ఇప్పటి వరకు ఈ కిట్లను గ్రామీణ యువతకు పంపిణీ చేయడంలో అధికారుల నిర్లక్ష్యం వహిస్తూ ఎంపీడీవో కార్యాలయంలోనే ఉంచారు. ఇప్పటికైనా మండల ప్రజా పరిషత్ శాఖ అధికారులు స్పందించి స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేయాలని యువకులు కోరుతున్నారు.

## కొరకంటి అడవుల్లో చెలరేగిన మంటలు



కొరకంటి అడవుల్లో కాలుతున్న చెట్లు, ఎండిన ఆకులు

పెంబి, ఫిబ్రవరి 20: నిర్మల్ జిల్లా పెంబి మండలం తాంద్ర రేంజ్ పరిధిలోని రాయదారి సెక్షన్ కొరకంటి గ్రామ సమీపంలోని అడవిలో మంటలు చేలరేగాయి. దీంతో అటవీ ప్రాంతంలోని చిన్నచిన్న మొక్కలు, చిన్నచిన్న వన్య ప్రాణులు, కిందపడ్డ చెట్లు మంటల్లో కాలిబూడిదయ్యాయి. అటవీ ప్రాంతంలో మంటలు చేలరేగకుండా ఫైర్‌లైన్, ఇతర చర్యలు చేపట్టకపోవడంతోనే అడవిలో మంటల చెలరేగాయని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అటవీ శాఖ అధికారులు అడవుల్లో మంటలు చెలరేగకుండా తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నిర్మల్‌అర్బన్, ఫిబ్రవరి 20: నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామానికి చెందిన కస్తూరి రాజు(18) అనే యువకుడు బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నిజామాబాద్‌లోని దవాఖానలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కస్తూరి రాజు బుధవారం నిర్మల్ నుంచి బైక్‌పై వస్తుండగా కనకాపూర్ గ్రామ శివారులోని ధర్మకాంట వద్దకు చేరుకోగానే ఖానాపూర్ నుంచి నిర్మల్ వైపు వస్తున్న కారు అతి వేగంగా అజాగ్రత్తగా నడుపుతూ బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కస్తూరి రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం మొదట నిర్మల్‌కు, అనంతరం నిజామాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రాజు మృతి చెందాడు. నర్సాపూర్ గ్రామానికి చెందిన కాహితీ సుధాకర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ వినోద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుమలత తెలిపారు.

## హైలెవల్ కెనాల్‌లో లారీ బోల్తా

సారంగాపూర్, ఫిబ్రవరి 20: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని రాణాపూర్ గ్రామ సమీపంలో ఉన్న హైలెవల్ కెనాల్‌లో గురువారం లారీ బోల్తా పడినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. లారీలో సిమెంట్‌ను తీసుకొని ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వస్తోంది. లారీ డ్రైవర్ ఇష్తికర్ నిర్లక్ష్యంతో నడపడం వల్ల అదుపు తప్పి రాణాపూర్ వద్ద ఉన్న స్వర్ణ హైలెవల్ కెనాల్‌లో బోల్తా కొట్టింది. ఈ సంఘటనలో డ్రైవర్ ఇష్తికర్ తలకు గాయం కాగా ఎలాంటి ప్రాణాపాయం జరుగలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్లపై అవగాహన

ముథోల్, ఫిబ్రవరి 20 : నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై లబ్ధిదారులకు ఎంపీడీవో శివ కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. నిర్మాణాన్ని బట్టి డబ్బులు ఖాతాలో జమవుతాయని పేర్కొన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

## సారంగాపూర్ మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలు

సారంగాపూర్, ఫిబ్రవరి 20: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలు గుర్తించినట్లు ఎంపీడీవో లక్ష్మీకాంత్ రావు తెలిపారు. అడెల్లి, నాగాపూర్, రవీందర్ నగర్ కలిసి ఒక అడెల్లి ఎంపీటీసీ స్థానం, అలూర్, బీరవెల్లి, ప్యారమూర్ కలిపి బీరవెల్లి ఎంపీటీసీ స్థానం, బోరిగాం ఒకటి, చించోలి(బీ) ఒకటి, మల్లక్‌చించోలి, వంజర్ కలిపి మల్లక్‌చించోలి ఎంపీటీసీ స్థానం, ధని, గోపాల్‌పేట్, సోనాపూర్ కలిపి ధని ఎంపీటీసీ స్థానం, యాకర్‌పల్లి, హన్మాన్‌తండా, సాయినగర్, మహావీర్‌తండా గ్రామాలు కలిపి హన్మాన్‌తండా ఎంపీటీసీ స్థానం, జామ్ ఒక ఎంపీటీసీ, కౌట్ల(బీ) ఎంపీటీసీ ఒకటి, పోన్‌కూర్, జౌళి గ్రామాలు కలిపి ఒక ఎంపీటీసీ స్థానం, పొట్యా, రాంసింగ్‌తండా, ఇప్పచెలిమి, పండల్‌ధరి, లింగాపూర్ గ్రామాలు కలిపి ఒక ఎంపీటీసీ స్థానం, సారంగాపూర్ ఎంపీటీసీ స్థానం, తాంద్ర(జీ), వైకుంఠపూర్, కంకెట గ్రామాలు కలిపి ఒక ఎంపీటీసీ స్థానాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

## అబాకస్ సాధనతోనే మేధో సంపత్తి

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 20 :అబాకస్ సాధనతోనే విద్యార్థుల్లో మేధో సంపత్తి పెరుగుతుందని నారాయణ పాఠశాల ఏజీఎం ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం నిర్మల్‌లోని నారాయణ ఒలింపియాడ్ పాఠశాలలో జోనల్ స్థాయి అబాకస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.